సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 19 । నవంబర్ । 2024



దుర్గమ్మకు వెండి కిరీటం


ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువున్న కనకదుర్గమ్మకు కొమ్ముల స్వామినాయుడు కుటుంబం (ద్రాక్షారామ) సుమారు రూ.1.30 లక్షలతో 1.3 కిలోల వెండితో కిరీటం సమర్పించింది.



రూ.1.50 లక్షల విరాళం

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద నిర్మిస్తున్న ఆంధ్రా భద్రాద్రి ఆలయంలో గోదాదేవి విగ్రహం ఏర్పాటుకు రావూరి రాంబాబు రూ.1.50 లక్షల విరాళం సమర్పించారు.

కడలిలోకి 17 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 17,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 800, పశ్చిమ డెల్టాకు 2,500 కలిపి మొత్తం 3,900 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన మహాసేన రాజేష్

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును మహాసేన రాజేష్, అతని అనుచరులు స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం కలిశారు. మలికిపురం మండలం శంకరగుప్తానికి చెందిన ఓ మహిళ.. తన ఫొటోలను రాజేష్, అతని అనుచరులు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టారన్న ఫిర్యాదుపై మలికిపురం పోలీసు స్టేషన్‌లో ఈ నెల 15న కేసు నమోదైన సంగతి తెలిసిందే. రాజేష్, అతని అనుచరులు ఎస్పీని కలిసి ఈ కేసు విషయమై మాట్లాడారు. తనపై నమోదైన కేసుపైన, తనను నిందితుడిగా చేర్చిన విషయాలపై ఎస్పీకి రాజేష్ వివరణ ఇచ్చుకున్నట్టు తెలిసింది.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50 వేల విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన మత్సటి శివ, సత్యవతి దంపతులు రూ.లక్ష విరాళం అందించినట్టు ఆలయ ఈఓ నల్లం సూర్య చక్రధర్ తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం



కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల ఆన్‌లైన్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులకు సూ చించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమంలో ఆయన, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్‌ఓ వి.మదనమోహనరావు, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీ రాణి అర్జీదారుల నుంచి సుమారు 220 వినతులను స్వీకరించారు. అందుబాటులో ఉన్న అధికారుల ద్వారా పరిష్కార మార్గాలు చూపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 24 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 24 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు అర్జీలు అందించి తమ సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఎస్పీ కృష్ణారావు సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలను ఆదేశించారు. వచ్చిన అర్జీల్లో ఎక్కువగా కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించినవి ఉన్నాయి.

అక్రమార్కుల ర్యాంపువాక్!

- గుడ్లప్పగించి చూస్తున్న అధికారులు
- అనధికార ర్యాంపులలో జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు
- బిడ్‌లు ఖరారు చేసిన జిల్లా యంత్రాంగం
- స్టాక్ పాయింట్ల వద్ద నిర్ధారణ కాని ధర
- అధికారిక ర్యాంపుల్లో పూర్తిస్థాయిలో తవ్వకాలకు మరో వారం పట్టే అవకాశం
- కాసులు వచ్చే ర్యాంపులను వదులుకోలేకపోతున్న కీలక నేతలు
- వారి వత్తాసుతోనే అడ్డగోలుగా తవ్వకాలు
- సిండికేటుదారుల ఒత్తిడితో అడపాదడపా దాడులు



అయినవిల్లి మండలం కొండుకుదురులంక వద్ద పడవల మీద తెచ్చిన ఇసుక లోడింగ్

సాక్షి, అమలాపురం: జిల్లాలో గోదావరి నదీపాయల్లో ఎంపిక చేసిన ఇసుక ర్యాంపులకు టెండర్లు ఖరారయ్యాయి. ఇప్పటికే ఆయా ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు మొదలు కావాల్సి ఉన్నా జిల్లా యంత్రాంగం నాన్చుడు ధోరణి కారణంగా ఇంకా ప్రారంభం కాలేదు. ఇదే సమయంలో అక్రమార్కులు మాత్రం చెలరేగిపోతున్నారు. కీలక నేతల దన్నుతో ఇసుక తవ్వకాల జోరు పెంచారు. అధికార ర్యాంపులు ప్రారంభమైనా 'వెనక్కు తగ్గేదేలే' అని అంటున్నారు.

జిల్లాలో 12 ర్యాంపులకు టెండర్లు ఖరారు కావడంతో ఈ నెల 16వ తేదీ నుంచి తవ్వకాలు మొదలు పెట్టాలని జిల్లాస్థాయి ఇసుక కమిటీ నిర్ణయించింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ గత నెల 14వ తేదీన ప్రకటించారు. కాని ఇప్పటికీ ఆయా ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు మొదలు కాలేదు. ఒకవైపు ఇసుకకు కొరత ఏర్పడి భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పాలవుతున్నారు. నిర్మాణం రంగం దాదాపు నిలిచిపోయింది. నిర్మాణ పనులపై ఆధారపడిన పలు వ్యాపారాల సంస్థలలో అమ్మకాలు నెమ్మదించాయి. ఈ సమయంలో ర్యాంపుల నుంచి సాధ్యమైనంత త్వరగా ఇసుక తవ్వకాలు మొదలు పెట్టి వినియోగదారులకు అందించాల్సి ఉంది. కాని జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ర్యాంపులు దక్కించుకున్నవారు ఇంకా తవ్వకాలు మొదలు పెట్టలేదు. కారణాలు ఏమైనా ర్యాంపులలో తవ్వకాలకు పూర్తిస్థాయిలో అనుమతులు రాలేదనే చెప్పవచ్చు. ప్రధాన అవరోధం.. రీచ్‌లకు అనుబంధంగా ఉన్న స్టాక్ పాయింట్‌లో ఎగుమతి చేసే ఇసుక ధర నిర్ణయించకపోవడమే. అందువల్లే తవ్వకాలు ఆలస్యమవుతున్నాయని తెలుస్తోంది. ఇదే సమయంలో ఇసుక తవ్వకాలకు అనుగుణంగా ర్యాంపులలో బాటలు వేయడం, ఇతర సదుపాయాల కల్పనకు వేలం పాటలు సొంతం చేసుకునేవారు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

ర్యాంపులు తెరిచినా అక్రమాలు ఆగేలా లేవు

జిల్లా ఇసుక కమిటీ గుర్తించిన 12 ర్యాంపులలో ఇసుక తవ్వకాలు అధికారికంగా మొదలైనా ఇసుక అక్రమ తవ్వకాలకు బ్రేకులు పడే పరిస్థితి లేదు. అక్రమార్కులకు అండగా నియోజకవర్గ స్థాయి నేతలు ఉండడం, వారికి ఏ రోజుకారోజు వాటాలు వెళుతుండడంతో అక్రమార్కులను అడ్డుకునేవారు లేకుండా పోయారు. ఇసుక కొరత పేరుతో ఇష్టానుసారం జరుగుతున్న అక్రమ తవ్వకాలకు కూటమి పెద్దల దన్ను ఉండడంతో అక్రమార్కులను అడ్డుకునేవారు లేకుండా పోయారు. ఈ పరిస్థితి చూసి వేలంలో ర్యాంపుల దక్కించుకున్నవారికి ఆందోళన అధికమవుతోంది. మరీ ముఖ్యంగా తక్కువకు టెండరు వేసి అడ్డుగోలుగా దోపిడీ చేద్దామనుకున్న వారికి ఇసుక కొరత లేకపోయినా.. సుదూర ప్రాంతాలకు రవాణా జరగకున్నా ర్యాంపులు గిట్టుబాటు కాకుండా పోతాయనే ఆందోళన నెలకొంది. దీంతో రెండు రోజులుగా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులపై ర్యాంపు యజమానులు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలపై చిన్నచిన్నగా దాడులకు దిగుతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి పి.గన్నవరం, సోమవారం అయినవిల్లిలో ఇసుక తవ్వకాలను అడుకుని ట్రాక్టర్లు, లారీలు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమార్కుల బరితెగింపు

ఇదే అదనుగా అక్రమార్కులు మరింత బరితెగించారు. ఈ నెల ఆరంభం నుంచి జిల్లాలో పలుచోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు మొదలయ్యాయి. జిల్లాలో తొలుత ఆలమూరు మండలం జొన్నాడలో ఇసుక తవ్వకాలు మొదలు కాగా, తరువాత ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక, పులిదిండి, వద్దిపర్రు, అంకంపాలెం, రావులపాలెం మండలం గోపాలపురం, ఊబలంక, కొత్తపేట మండలం మందపల్లి, అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, కొండుకుదురులంక, శానపల్లిలంక, వీరవల్లిపాలెం, ముమ్మిడివరం మండలం ఠాన్నేల్లంక, పి.గన్నవరం అన్నంపల్లి అక్విడెక్టు వద్దనే కాకుండా కె.గంగవరం, కాట్రేనికోన, మామిడికుదురు మండలాల్లో ఎక్కడ పడితే అక్కడ ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. చివరకు కోస్టల్ రెగ్యులరైజేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలో సైతం ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. స్థానికంగా నియోజకవర్గ స్థాయి నేతతో మాట్లాడుకోవడం.. సొంతంగా ర్యాంపులు వేసుకోవడం టీడీపీ, జనసేన చోటామోటా నేతలకు పరిపాటిగా మారింది. జిల్లా సాండ్ కమిటీ ఆధ్వర్యంలో గుర్తించిన ఇసుక ర్యాంపుల వద్ద కూడా అక్రమ తవ్వకాలు సాగిపోతున్నాయి. ఆలమూరు, తాతపూడి ర్యాంపు పేరుతో సరిహద్దులోని కొత్తపేట మండలం మందపల్లి వద్ద తవ్వకాలు చేస్తున్నారంటే అక్రమార్కుల బరితెగింపును అర్థం చేసుకోవచ్చు.



అయినవిల్లి మండలంలో ట్రాక్టర్లపై తరలిపోతున్న ఇసుక



ఐ.పోలవరం పోలీసులు అదుపులోకి తీసుకున్న ఇసుక లారీలు

హామీలు నెరవేర్చాలని సీపీఐ డిమాండ్



కపిలేశ్వరపురం గ్రామ సచివాలయం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ, బీకేఎంయూ నాయకులు, ఇళ్లు, భూముల ఆశావహులు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ, భారతీయ కిసాన్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) నేతల డిమాండ్ చేశారు. ఈ హామీల్లో ఒకటైన పేదోడికి సొంతింటి కల సాకారమయ్యేలా చూడాలని సూచించారు. సీపీఐ, బీకేఎంయూ రాష్ట్ర వ్యాప్త పోరాటాల్లో భాగంగా నిర్వహించిన డిమాండ్స్ డే సందర్భంగా నాయకులు జిల్లాలోని పలు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇళ్లు, భూమి లేని నిరుపేదలైన ఆశావహులతో కలసి సోమవారం వినతి పత్రాలు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో... గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 3 సెంట్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు గుర్తు చేశారు. వ్యవసాయ భూమి లేని నిరు పేదలకు 2 ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని సత్తిబాబు చేశారు. రామచంద్రపురం, మండపేట, అమలాపురం, కొత్తపేట నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల్లో అర్జీలు ఇచ్చినట్టు బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు.

డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా తగదు

అమలాపురం రూరల్: మెగా డీఎస్సీని రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ సాకుతో వాయిదా వేయడం తగదని కలెక్టరేట్ వద్ద మాల మహానాడు, బీఈడీ అసోసియేషన్, ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ధర్నా నిర్వహించారు. పండు అశోక్ కుమార్, జంగా బాబురావు, పెయ్యల పరశురాముడు మాట్లాడుతూ ఎందరో నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట తప్పి డీఎస్సీ ఎలా వాయిదా వేస్తారని ప్రశ్నించారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను ఆదుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో వారు వినతిపత్రాన్ని సమర్పించారు. జల్లి శ్రీనివాస్, పెయ్యల చిట్టి బాబు, నాతి శ్రీనివాసరావు, గెల్లా వెంకటేష్, గెద్దాడ బుద్ధరాజు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ ఉద్యోగుల నిరశన



కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేస్తున్న108 ఉద్యోగులు

అమలాపురం రూరల్: 108 అంబులెన్స్ సర్వీస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద విధులలో లేని ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. జిల్లా జనరల్ సెక్రటరీ పోతురాజు, కోశాధికారి చిట్టిబాబు మాట్లాడుతూ కొద్ది రోజులుగా శాంతియుతంగా పలు నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వ అధికారులు సమస్యలు పరిష్కరించక పోవడంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 11వ తేదీన ప్రభుత్వ అధికారులకు, యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. ప్రభుత్వ అధికారులు, యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో తప్పని పరిస్థితుల్లో 25 తేదీ నుంచి సమ్మె చేస్తామని తెలిపారు. ప్రజల అసౌకర్యానికి పూర్తి బాధ్యత ప్రభుత్వ అధికారులే వహించవలసి ఉంటుందని అన్నారు. 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, బకాయిలను పూర్తిగా చెల్లించే బాధ్యత ప్రభుత్వమే చేపట్టాలని, 108 వ్యవస్థలో రోజుకు మూడు షిఫ్టులలో 8గంటల పనివిధానం అమలు చేయాలని కోరారు. సీఐటీయూసీ నాయకులు నూకల బలరాం, అంగన్‌వాడీ జిల్లా కోశాధికారి కృష్ణవేణి, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు నిరాహార దీక్షలకు మద్దతు తెలిపారు.

మిచాంగ్ నష్టపరిహారం కోసం రైతుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పలు మండలాలకు పంట నష్ట పరిహారం రాలేదని రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద కోనసీమ బీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. 2023 సంవత్సరంలో డిసెంబర్ 5తేదీన మిచాంగ్ తుపాను వల్ల పంటలు నష్ట పోయిన రైతులకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించడానికి చర్యలు చేపట్టింది. ఎన్నికల కోడ్ వల్ల జాప్యం జరిగింది. అయితే కూటమి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పంట పరిహారం అమలాపురం మండల రైతులకు అందలేదన్నారు.అమలాపుర మండలంలో 1,961 మంది రైతులకు రూ. 2.28 కోట్ల పంట నష్ట పరిహారం అందవలసి ఉందని రైతు సంఘ నాయకులు ఉప్పగంటి భాస్కరరావు, అప్పారి చిన వెంకటరమణ తెలిపారు. గతంలో అధికారులకు స్పందనలో వినతిప త్రాలు ఇచ్చామన్నారు. జాబితాలో తేడా ఉందని మళ్లీ పంపుతున్నామని తెలిపారని అన్నారు. అమలాపురం మండలం, నల్లమిల్లి జనుపల్లి గ్రామాల్లో రైతులతో పాటు పలు గ్రామాల రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. వరి పంట పొలం మీద వచ్చే ఆదాయంతోనే తాము జీవిస్తున్నామని వారు చెప్పారు. ప్రభుత్వం తక్షణమే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినితిపత్రం అందించారు.

11 నెలలుగా పరిహారం రాలేదు



నేను కౌలు రైతుగా ఆరు ఎకరాల్లో పంట సాగు చేశాను. 2023లో వచ్చిన తుపాను వల్ల పంట పూర్తి పోయింది. పంట పరిహారంగా నాకు రూ.41 వేల సాయం అందవలసి ఉంది. అధికారులు చుట్టూ తిరుగుతున్నా పరిహారం అందలేదు.

– బద్దే రామకృష్ణ కౌలు రైతు, ఎ.వేమవరప్పాడు, అమలాపురం మండలం

చర్యలు చేపట్టాలి



పరిహారం కోసం ఆరు సార్లు స్పందన కార్యక్రమంలో కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రాలు అందించాను. ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు చేపట్టాలి. నాకు ఐదు ఎకరాలకు రూ.34 వేల పరిహారం అందవలసి ఉంది.

– వాకపల్లి శ్రీను, రైతు, జనుపెల్లి

డీఎంహెచ్‌వో ఆంక్షలపై ఆశాల ఆగ్రహం

- ధర్నాలో ఉద్రిక్తత.. కలెక్టరేట్‌లోకి దూసుకువెళ్లిన కార్యకర్తలు
- అడ్డుకున్న పోలీసులు.. తీవ్ర వాగ్వాదం, తోపులాట
- ఆంక్షలు ఎత్తివేస్తానన్న జిల్లా వైద్యాధికారి హామీతో ఆందోళన విరమణ




కలెక్టర్‌రేట్‌లోకి దూసుకువెళుతున్న ఆశా కార్యకర్తలు

అమలాపురం రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టరేట్ వద్ద చేపట్టిన భారీ నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద జిల్లావ్యాప్తంగా ఆశ వర్కర్లు ధర్నా చేపట్టారు. ఏ జిల్లాలో లేని విధంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆశాలు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పీహెచ్‌సీల్లోనే ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆంక్షలు విధించడంతో వాటిని తొలగించాలని ఆందోళన చేశారు. ఉదయం నుంచి ఆందోళన చేసినా ఎప్పటికీ జిల్లా వైద్య అధికారి కలెక్టరేట్ నుంచి బయటకు రాకపోవడంతో ఆగ్రహించిన ఆశ కార్యకర్తలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. దీంతో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం మధ్యాహ్నం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన ఆశలు కలెక్టరేట్‌లోకి దూసుకు వెళ్లారు. కార్యకర్తలు గేట్లు తోసుకుని లోపలికి వచ్చి డీఎంఅండ్ హెచ్‌ఓ రావాలని నినాదాలు చేశారు. ఈ సమయంలో పట్టణ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆశ కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేశామని ఆశ కార్యకర్తలు తెలిపారు. కనీస వేతనాలు చెల్లించాలి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా ఆశ వర్కర్లను పరిగణించాలి, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి, ప్రభుత్వ సెలవులు, మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులు ఇవ్వాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి, ఇళ్లు లేని వారికి స్థలాలు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ నినాదాలు చేశారు. చివరకు యూనియన్ నాయకులు డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొరతో ఫోన్‌లో మాట్లాడారు. సాయంత్రం నాలుగు గంటల వరకు పీహెచ్‌సీల్లోనే ఉండాలని తానిచ్చిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకుంటానని ఆయన హామీ ఇవ్వడంతో ఆశాలు ఆందోళన విరమించారు. ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎస్తేరు రాణి, జిల్లా గౌరవ అధ్యక్షురాలు కృష్ణవేణి, ఆశ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మలక సుభాషిణి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.దుర్గాప్రసాద్, నూకల బలరాం, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరావు, సీఐటీయూ ఉపాధ్యక్షుడు భాస్కరరావు, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

యాప్‌ప్రమత్తం

- రోడ్డు ప్రమాదాల నివారణకు ఐఆర్‌ఏడీ యాప్
- తరుచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల గుర్తింపు
- ముందస్తు సమాచారంతో వాహన చోదకులకు అవగాహన



పోలీస్ శాఖ రూపొందించిన ఐఆర్‌ఏడీ యాప్ ఎంబ్లమ్

అమలాపురం టౌన్: తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అందుకు అనుగుణంగా అప్రమత్తమయ్యేలా రాష్ట్ర పోలీస్ శాఖ ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా (ఐఆర్‌ఏడీ) యాప్‌ను రూపొందించి దాని అమలుకు చర్యలు చేపట్టింది. జిల్లా పోలీసు శాఖ ఈ యాప్‌ను వినియోగించే విధానాలపై సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చింది. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నుంచి కానిస్టేబుల్ వరకూ ఈ యాప్‌పై అవగాహన కల్పిస్తోంది. ఎస్పీ బి.కృష్ణారావు ఈ నెల 16న యాప్‌ను ప్రారంభించారు. ఐఆర్‌ఏ డేట్ బేస్ నమోదు గురించి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు స్టేషన్ల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఐఆర్‌ఏడీ రోల్ అవుట్ మేనేజర్ జీవీ రామారావు, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డు బ్యూరో (డీసీఆర్‌బీ) సీఐ వి.శ్రీనివాసరావుల ఈ శిక్షణ తరగతులను పర్యవేక్షించారు.

అవగాహన పెంచాలి

కొత్తగా వచ్చిన ఐఆర్‌ఏడీ యాప్‌పై పోలీస్ సిబ్బంది పూర్తి స్థాయి అవగాహనతో ఉండడమే కాకుండా వాహన చోదకులకు జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ఎక్కడికక్కడ రోడ్డు ప్రమాదాల నివారణ నిబంధనలపై అవగాహన కల్పించాలని ఎస్పీ కృష్ణారావు యాప్ శిక్షణ తరగతుల్లో సూచించారు. వాహన చోదకులు విధిగా హెల్మెట్లు ధరించాలని, సీటు బెల్ట్‌లు పెట్టుకోవాలని స్పష్టం చేశారు. వాహనాలను నిర్లక్ష్యంగా, పరధ్యానంగా నడపకుండా డ్రైవింగ్ సమయంలో పూర్తి అప్రమత్తతో ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ఎంత ప్రమాదకరమో వాహన చోదకులకు పోలీసు అధి కారులు తరుచూ కౌన్సెలింగ్ ద్వారా తెలియజేయాలన్నారు. లైసెన్స్‌ను లేకుండా టీనేజ్ పిల్లలకు మోటారు సైకిళ్లు నడిపే అధికారం లేదని, తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. మానవ తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదం జరిగి ఎవరైనా చనిపోతే ఆ కుటుంబం ఎంత క్షోభిస్తుందో, ఎంతటి నష్టం చేకూరుతుందో డ్రైవింగ్ చేసే వ్యక్తులకు కనువిప్పు కలిగేలా వివరించాలని ఎస్పీ కృష్ణారావు జిల్లా పోలీస్ సిబ్బందికి సూచించారు.

రోడ్డు ప్రమాదాల స్పాట్లను గుర్తించేది ఇలా..

ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగిన ప్రదేశానికి పోలీస్ దర్యాప్తు అధికారి (ఐవో) వెళ్లి అక్కడ ఐఆర్‌ఏడీ యాప్ ద్వారా ప్రమాద సమాచారాన్ని నమోదు చేయాలి. ఇదే స్పాట్‌లో గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయా? లేదా? అనే అంశంపై ఆ అధికారి అక్కడే అధ్యయనం చేస్తారు. ఒకవేళ ఆదే స్పాట్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతుంటే ఆ విషయాన్ని యాప్‌లో నమోదు చేయాలి. ఈ సమాచారాన్ని ఇటు ఎస్పీ కార్యాలయానికి, అటు రాష్ట్ర పోలీస్ కార్యాలయానికి యాప్ ద్వారా పంపించాలి. యాప్‌లో రోడ్డు ప్రమాదాల సమాచారాన్ని నమోదు చేస్తూనే అక్కడ ఇక ముందు రోడ్డు ప్రమాదాల జరగకుండా సూచనలు, జాగ్రత్తలతో అప్రమత్తం చేసే దిశగా చర్యలు చేపడతారు. వాహనాల డ్రైవర్లకు తెలిసేలా ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటూ హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేస్తారు.

క్లుప్తంగా

పాము కాటుకు మూడో తరగతి విద్యార్థి మృతి


మృతుడు ధనుష్

నల్లజర్ల: పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి పరిసరాల్లో ఆడుకుంటున్న మూడో తరగతి విద్యార్థి పాముకాటుకు గురై ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మండలంలోని సింగరాజుపాలెంలో ఈ దుర్ఘటన జరిగింది. నల్లజర్లలో నివాసం ఉంటున్న బోయపాటి సాగర్, కవితల ఏకైక కుమారుడు ధనుష్ (7). సాగర్ అయ్యప్పమాల వేసుకోవడంతో కవిత అక్క ఊరైన సింగరాజుపాలెం వీరు ముగ్గురూ వచ్చారు. ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో దీపావళికి తెచ్చిన టపాసులు కాల్చుకుంటున్న ధనుష్ కాలి బొటనవేలిపై తుప్పల్లో ఉన్న తాచుపాము మూడుసార్లు కాటు వేసింది. ఈ హఠాత్ పరిణామాన్ని ధనుష్ తల్లికి చెప్పాడు. వెంటనే అతనిని నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తాడేపల్లిగూడెం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ధనుష్ నల్లజర్లలో ఒక పాఠశాలలో మూడో తరగతి చదువుతుండగా తల్లిదండ్రులు ఇద్దరూ వేర్వేరు విద్యాసంస్థల్లో టీచర్లుగా పనిచేస్తున్నారు. నాలుగు రోజులు ఆనందంగా గడుపుదామని ఇక్కడకు వచ్చిన వారి కుమారుడికి మృత్యువు పాముకాటు రూపంలో వచ్చిందని, ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, ఆ పరిసర ప్రాంత ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

పీఎఫ్ కార్యాలయానికి స్వచ్ఛత అవార్డు


అవార్డుతో రీజనల్ పీఎఫ్ కమిషనర్లు మనోజ్‌కుమార్, శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా భవిష్యనిధి సంస్థ భవిష్య నిధి స్వచ్ఛత అవార్డు–2024 అందుకుంది. భవిష్యనిధి సంస్థ దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న తమ ప్రాంతీయ కార్యాలయాలకు వివిధ కేటగిరీల కింద భవిష్య నిధి అవార్డులను ప్రకటించింది. ఈ నెల 15వ తేదీన న్యూఢిల్లీలో డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖామంత్రి మన్సుఖ్ మాండవియా చేతులమీదుగా అవార్డును రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయ ఇన్‌చార్జి, రీజనల్ పీఎఫ్ కమిషనర్–1 మనోజ్‌కుమార్ అందుకున్నారు. రీజనల్ పీఎఫ్ కమిషనర్–2 వై.డి.శ్రీనివాస్ పాల్గొన్నారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయంలో భవిష్యనిధి స్వచ్ఛత అవార్డు పొందటానికి సహకరించిన అధికారులు, సిబ్బందిని ఆర్‌పీఎఫ్ కమిషనర్–1 మనోజ్‌కుమార్ అభినందించారు. ఈ అవార్డు సాధించడంలో సహాయపడిన హౌస్ కీపింగ్ సిబ్బందిని శాలువా, మెమెంటోతో సత్కరించారు.

ఓం సోమశేఖరాయనమః

కార్తికమాసం మూడో సోమవారం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఓం నమఃశివాయ నామస్మరణ మారుమోగింది. ద్రాక్షారామ, కోటిపల్లి, సామర్లకోట, పిఠాపురం, మురమళ్ల, రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురంలోని శివాయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివార్లకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాల సమీపంలోని నదీ తీరాలు, కోనేరుల్లో భక్తులు స్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వదిలారు. సాలిగ్రామ, దీప, వస్త్ర తదితర దానాలు చేశారు. పురోహితులకు స్వయంపాకాలు అందజేశారు. సాయంత్రం వరకు ఉపవాసాలు ఉండి మరోసారి ఆ సోమశేఖరుడి దర్శనం చేసుకొన్నారు. ఆలయాల్లో సామూహికంగా దీపారాధనలు నిర్వహించారు.


రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానమాచరిస్తున్న భక్తులు


రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో కార్తిక దీపాలు వదులుతున్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో పిఠాపురం పాదగయ పుణ్యక్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి


ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు


సామర్లకోటలో కుమార భీమేశ్వరునికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


కాకినాడ దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

తొమ్మిది ఇసుక ట్రాక్టర్ల సీజ్


సీజ్ చేసిన ఇసుక, బొండుమట్టి ట్రాక్టర్లు

అయినవిల్లి: మండలంలో అక్రమంగా ఇసుక, బొండు మట్టి తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు సోమవారం ఎస్సై మనోహర జోషి తెలిపారు. మండలంలోని శానపల్లిలంక, కొండుకుదురు, వీరవల్లిపాలెం గ్రామాల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో ప్రత్యేక పోలీసు బృందంతో దాడి చేశారు. శానపల్లిలంకలో ఐదు, కొండుకుదురులో రెండు, వీరవల్లిపాలెంలో రెండు మొత్తం తొమ్మిది ట్రాక్టర్ల ద్వారా ఇసుక, బొండుమట్టి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. వాటిని సీజ్ చేసి, అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు.

పంచారామ క్షేత్రంలో ఆర్‌జేసీ సుబ్బారావు


ఆర్‌జేసీ కుటుంబ సభ్యులకు ఆశీర్వదిస్తున్న వేద పండితులు

సామర్లకోట: దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కొమ్ము సుబ్బారావు దంపతులు సోమవారం పంచారామ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆర్‌జేసీ దంపతులకు ఈఓ భళ్ల నీలకంఠం, ఉత్సవాల ప్రత్యేకాధికారి కేవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవ స్వామి, పెద్ద నంది, మూలవిరాట్‌లను, స్వామి,అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం పండితుల ఆశీర్వచనాలు, స్వామివారి ఫొటో, ప్రసాదం అందజేశారు. ఆలయ శ్రీచక్రపండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆలయ చరిత్ర, విశిష్టతను ఆర్‌జేసీకి వివరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు


సత్యదేవుని ప్రధానాలయం వెలుపల భక్తులు కానుకలు సమర్పించే పెద్ద హుండీ

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో కార్తిక మాసం గడచిన 18 రోజుల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నారు. సత్యదేవుని నిత్య కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమానికి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి దేవస్థానం సిబ్బంది అందరూ విధిగా హాజరు కావాలని ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. ఆదాయం లెక్కింపు సాయంత్రం వరకూ కొనసాగనుంది. ఏటా కార్తికంలో పౌర్ణమి తరువాత, మాసం ముగిశాక హుండీల ఆదాయాన్ని లెక్కించడం ఆనవాయితీ.

గత కార్తికంలో రూ.2.81 కోట్ల రాబడి

గత ఏడాది కార్తిక మాసంలో దేవస్థానానికి హుండీల ద్వారా రూ.2.81 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే వివిధ కారణాలతో గత కార్తికం ముందు ఒకసారి, మధ్యలో ఒకసారి, కార్తిక మాసం తరువాత పది రోజులకు ఒకసారి హుండీల ఆదాయం లెక్కించారు. దీంతో కార్తిక మాసం హుండీల ఆదాయాన్ని 30 రోజుల సరాసరిగా లెక్కించారు. గత ఏడాది కార్తికంలో అన్ని విభాగాల ద్వారా రూ.20 కోట్లు పైగా ఆదాయం వచ్చింది. ఈసారి ఇది రూ.25 కోట్లు పైబడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒక్క హుండీల ద్వారానే రూ.3.5 కోట్లు వస్తుందని అంచనా వేస్తున్నారు. తొలి విడతగా మంగళవారం జరిపే లెక్కింపులో సుమారు రూ.1.50 కోట్లు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

గోడ కూలి మీద పడడంతో వ్యక్తి మృతి

పి.గన్నవరం: మండలంలోని కుందాపల్లి గ్రామంలో సోమవారం పాత పెంకుటిల్లును విప్పుతుండగా ప్రమాదవశాత్తూ గోడ కూలడంతో తీవ్ర గాయాలపాలై ఒక వ్యక్తి మృతిచెందాడు. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కుందాలపల్లికి చెందిన కాసర శ్రీనివాసరావు తన పాత ఇంటిని విప్పే పనులను కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన కామిశెట్టి సూరిబాబుకు అప్పగించాడు. దీంతో సూరిబాబు వానపల్లి గ్రామానికి చెందిన గంధం దుర్గాప్రసాద్, అతడి తండ్రి సత్యనారాయణ, తమ్ముడు ఆదినారాయణ (33)లతో కలిసి సోమవారం పెంకిటిల్లును విప్పుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తూ ఇంటి గోడ కూలి ఆదినారాయణపై పడింది. అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆదినారాయణ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని సోదరుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

భవానీ ఆత్మహత్య కేసును పునర్విచారించాలని వినతి

అమలాపురం టౌన్: ఆత్మహత్య చేసుకున్న ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రొడ్డా భవానీ కేసును పునర్విచారణ చేయించాలని ఆమె భర్త జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో భవానీ ఆత్మహత్యపై భర్తతో పాటు ప్రజా సంఘాల ప్రతినిధులు ఎస్పీని కలసి ఫిర్యాదును అందించారు. వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, పౌరహక్కుల జిల్లా నాయకులు అమలదాసు బాబూరావు, రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షుడు మచ్చా నాగయ్య పాల్గొన్నారు.

స్త్రీ నిధి రూ.22 లక్షల స్వాహా

- పరారీలో వీఓఏ
- విచారణ చేస్తున్న అధికారులు


విచారణ చేస్తున్న ఏపీఎం వేదకుమారి

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి గ్రామ సంఘం–1లో వీఓఏ పనిచేస్తున్న కె.దుర్గ 11 మహిళా సంఘాల సభ్యుల నుంచి సుమారు రూ.22.5 లక్షలు స్త్రీనిధి డబ్బును స్వాహా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లా డీఆర్‌డీఏ అధికారుల ఆదేశాలతో ఏపీఎం శరకణం వేదకుమారి బూరుగుపూడిలోని తల్లీపిల్ల భవనంలో సోమవారం డ్వాక్రా సంఘాల మహిళలతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూరుగుపూడిలో వీఓఏ దుర్గ మూడు నెలలుగా స్త్రీనిధి సొమ్ము చెల్లించలేదన్నారు. దీంతో డబ్బు కట్టాలని నిలదీయడంతో ఈ నెల 10లోపు సొమ్ము చెల్లిస్తానని చెప్పారన్నారు. స్త్రీనిధి సొమ్ము చెల్లించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టగా వీఓఏ పరారీలో ఉన్నారని ఆమె తెలిపారు. దీనిపై మరింత విచారణ చేపట్టి నిధులు దుర్వినియోగం జరిగినట్లు తెలిస్తే గ్రామ సంఘాల సభ్యుల ఆమోదంతో తీర్మానం చేసి ఆమెపై కేసు నమోదు చేస్తామన్నారు. తమకు తెలియకుండానే సంఘాల్లోని సభ్యుల పేరున స్త్రీనిధి డబ్బు కాజేయడం అన్యాయం అని డ్వాక్రా సంఘాల మహిళలు వాపోయారు. అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సొమ్మును రికవరీ చేయాలన్నారు.

మంత్రి సుభాష్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

కోనసీమ శెట్టిబలిజ నాయకుల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న కోనసీమ శెట్టిబలిజ నాయకులు

అమలాపురం టౌన్: కాకినాడలో ఆదివారం జరిగిన శెట్టిబలిజ కార్తిక వన సమారాధనలో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన వ్యాఖ్యలు మా కులానికి మచ్చ తెచ్చేలా ఉన్నాయని కోనసీమ శెట్టిబలిజ సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. మంత్రి చేసిన వ్యాఖ్యలపై వారు అభ్యంతరం చెబుతూ ఖండించారు. స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో సోమవారం సాయంత్రం జరిగిన శెట్టిబలిజ నాయకుల సమావేశం మంత్రి సుభాష్ తమ సామాజిక వర్గ నాయకులను సంస్కార హీనులని, వెధవలని చేసిన వ్యాఖ్యలపై చర్చించింది. మంత్రి చేసిన వ్యాఖ్యలపై తమ సామాజిక వర్గం సిగ్గు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శెట్టిబలిజలు సంస్కార వంతులుగా ఉండడం వల్లే జిల్లాలో కొందరు సామాజిక వర్గ నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసినప్పుడు ఐక్యతతో గెలిపించి చట్ట సభలకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రితోపాటు ఇద్దరు శెట్టిబలిజ నాయకులు చేసిన వ్యాఖ్యలు కూడా ఎంత మాత్రం సమంజసంగా లేవని వారు అభిప్రాయపడ్డారు. తక్షణమే మంత్రి సుభాష్ తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కోనసీమ శెట్టిబలిజ సంఘ నాయకులు మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, వాసంశెట్టి తాతాజీ, సంసాని బులినాని, రెడ్డి సత్య నాగేంద్రమణి, వాసర్ల వెంకన్న, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, విత్తనాల ఇంద్రశేఖర్, దొంగ చిన్నా తదితరులు సమావేశమై మంత్రి సుభాష్ సుభాష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

పోలవరం కుడి కాలువలో మునిగి విద్యార్థి మృతి


గౌతమ్ మృతదేహం

దేవరపల్లి: స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థుల్లో ఒకరు పోలవరం కుడికాలువలో ప్రమాదవశాత్తూ పడి మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం దేవరపల్లిలో జరిగింది. ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్న పాముల గౌతమ్ (11) తన ఐదుగురు స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం హైస్కూలుకు సమీపంలోని పోలవరం కుడి కాలువ వద్దకు వెళ్లాడు. కాలువలో స్నానానికి దిగారు. గౌతమ్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఇది గమనించినా తోటి స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదు. రాత్రి 12.30 గంటల సమయంలో గౌతమ్ తల్లిదండ్రులు వెంకట్రావు, శిరీష్ దంపతులు తన కుమారుడు కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గౌతమ్‌తో వెళ్లిన ఐదుగురు స్నేహితులను పిలిచి విచారించగా కాలువలో స్నానానికి దిగి గౌతమ్ మునిగిపోయాడని తెలిపారు. విద్యార్థులు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం ఉదయం 6.30 గంటల నుంచి పోలీసులు కాలువలో గాలింపు చేపట్టారు. కాలువలో మునిగిపోయిన ప్రదేశానికి 200 మీటర్ల దూరంలో గడ్డిదుబ్బుకు చుట్టుకుని ఉన్న బాలుడి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై తెలిపారు.

ముగిసిన హాకీ పోటీలు


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రాష్ట్ర బాలుర జట్టు

- బాలికల విజేత 'తూర్పు'
- బాలుర విజేత విశాఖ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఈ నెల 16 నుంచి జరుగుతున్న ఎస్‌జీఎఫ్ఐ పాఠశాల క్రీడాసమాఖ్య అంతర్ జిల్లాల హాకీ పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి జట్టు, బాలుర విభాగంలో విశాఖ జట్లు విజేతలుగా నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం, విశాఖ ద్వితీయ, తృతీయస్థానాలు, బాలుర విభాగంలో తూర్పు, అనంతపురం జట్లు రెండు, మూడు స్థానాలు కై వసం చేసుకున్నాయి.

బహుమతి ప్రదాన కార్యక్రమంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ అతిథులుగా పాల్గొన్నారు. రాంచీలో డిసెంబర్‌లో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ పరిశీలకులు సెల్వ పాండియన్, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జార్జి, సంయుక్త కార్యదర్శి సునీల్, కె.పరశురాం, పిఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రాష్ట్ర బాలికల జట్టు
